క్లుప్తంగా

బీసీ గురుకులాలకు భవనాలు నిర్మించాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఉన్న బీసీ గురుకులాలకు ఐదెకరాల భూమి కేటాయించి రూ.25 కోట్లతో శాశ్వత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో కోరారు. అరకొర వసతుల మధ్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతోపాటు నిర్మల్, ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. లేకుంటే సెప్టెంబర్ 3న జిల్లా కేంద్రంలో మూడు వేల మందితో నిరసన దీక్ష చేపడతామని పేర్కొన్నారు.

కేటాయింపు హర్షణీయం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.3003 కోట్లు కేటాయించడం హర్షణీయమని ఆ పార్టీ మైనార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ముస్లిం మైనార్టీలకు సరైన నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా, మైనార్టీ విభాగం మండలాధ్యక్షుడు సలీంఖాన్, షౌకత్‌పాషా, అసీఫ్ అలీ తదితరులున్నారు.

తెప్పల పండుగ

కుభీర్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో వాగులకు కొత్తనీరు వచ్చిన సందర్భంగా శుక్రవారం గంగాదేవికి తెప్పలు వదిలిపెట్టారు. ఏటా గురుపూర్ణిమ తర్వాత వచ్చే శుక్రవారం మహిళలు తెప్పలను వదిలిపెట్టడం ఆనవాయితీ. తెప్పలను వదిలి పిండి వంటకాలను భుజించారు.

అమ్మవారి సేవలో డీఎల్‌పీవో

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం డీఎల్‌పీవో, మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదం అందించి ఆశీర్వదించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు, బిల్ కలెక్టర్ వంశీసాయి, శ్రీనివాస్, వాసవి తదితరులు ఉన్నారు.

'ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి'

కుంటాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కుంటాలలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్‌కు ముదిరాజ్ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమ నిధిని రూ.వెయ్యి కోట్లతో ఏర్పాటు చేయాలన్నారు. తమను బీసీ–డీ జాబితా నుంచి బీసీ–ఏలో చేర్చాలని పేర్కొన్నారు. శంకర్, భూమన్న, సాయిలు, రాములు, నరేందర్, నారాయణ, గజ్జారాం తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీలు చెప్పొద్దు

లోకేశ్వరం: సైబర్ నేరాలు పెరుగుతున్నందున ఫోన్‌కు వచ్చే ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దని ఎస్సై సక్రియా నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గడ్‌చాంద, ధర్మోర గ్రామాల్లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ బ్యాంకు వాళ్లమంటూ ఫోన్ చేస్తే నేరుగా బ్యాంకుకే వస్తామని చెప్పాలనారు. ఏఎస్సై దిగంబర్ తదితరులు ఉన్నారు.

సన్మానం


సన్మానంలో జడ్జి, న్యాయవాదులు

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్ కోర్టులో శుక్రవారం న్యాయవాదుల ఆధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సన్మానం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి జడ్జి అజయ్‌కుమార్ హాజరయ్యారు. ఖానాపూర్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన దేవేందర్‌కు స్వాగతం.. ఖానాపూర్ నుంచి బదిలీపై వెళ్తున్న రామకృష్ణకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందించా శాలువాలతో సన్మానించారు. న్యాయవాదులు రాజలింగం, ఆసిఫ్‌అలీ, బాశెట్టి శివ, ఐదు వెంకటేశ్, సలీంఖాన్, షబ్బీర్‌పాషా, రవికుమార్, వేణుగోపాల్, ఉన్నారు.

ఘనంగా బోనాల సందడి

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేక వేషధారణలో బోనాలు ఎత్తుకొని ఆలయాలకు తరలివెళ్లారు. గజ్జలమ్మ, ముత్యామ్మ మహాలక్ష్మీ, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు

- భయబ్రాంతులకు గురవుతున్న జనం
- బాసరలో శునకాల స్వైరవిహారం
- ప్రజలతోపాటు మూగజీవాలపైనా దాడులు
- నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు వేడుకోలు


బాసరలో గుంపులుగా వీధికుక్కలు

భోజన వ్యర్థాలు దొరకకపోవడంతో వీధికుక్కలు మూగజీవాలతోపాటు మనుషులపై దాడులు చేస్తున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా తిరగాలంటే భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధికుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని బాసర మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

బాసర: మండలకేంద్రంలో ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు.. అలాంటి పవిత్ర క్షేత్రంలో ప్రధానవీధుల్లో ఎక్కడ చూసినా వీధికుక్కలే దర్శనమిస్తున్నాయి. పలువురిపై దాడులు చేస్తున్నాయి. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అవసరాల నిమిత్తం బయటకు వచ్చే వృద్ధులు, ఇతరులు ఎటువైపు నుంచి వీధికుక్కలు వచ్చి తమపై దాడులు చేస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న గణేశ్‌నగర్, శ్రీవేంకటేశ్వర కాలనీ, శారదనగర్, బజార్ గల్లీ, మైలాపూర్‌లో వీధికుక్కలు ఒకే చోట 20కి పైగా గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతున్నాయి.

గతంలో వీధి కుక్కలు 20మందికి పైనే దాడి చేశాయని.. బాసర ఆర్జీయూకేటీ కళాశాలలోనూ శునకాల సంచారం పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. హాస్టల్ వసతి దగ్గర వీధికుక్కలు తిరుగుతూ విద్యార్థులు, సిబ్బందిపై దాడులు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.


ఆలయ ఈవో ఆఫీస్ ఎదుట వీధికుక్కల సంచారం

పట్టించుకోని అధికారులు..

బాసరలో గత మూడు రోజుల్లో మేకల మందపై దాడి చేశాయని.. వీధి కుక్కల సంతానం పెరగకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వీధుల్లో కుక్కల గుంపు పెరగడంతో చిన్నారులను బయటకు పంపించాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. కాలినడకన వెళ్లేవారితోపాటు ద్విచక్ర వాహనానదారులను వెంబడిస్తూ భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధికుక్కల నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

బయటకు వెళ్లాలంటేనే భయం..



ఎటు నుంచి వచ్చి తమను కుక్క కాటు వేస్తుందోనని చిన్నారులు, వృద్ధులు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. గతేడాది నాపై కుక్క దాడి చేసింది. ఇప్పుడు మా గ్రామంలో గుంపులుగా రోడ్ల మీద తిరుగుతున్నాయి. – ప్రకాశ్, బాసర

ఆలయ పరిసరాల్లో సంచారం..



సరస్వతి ఆలయ పరిసరాల్లో వీధికుక్కలను చూసి దర్శనానికి వచ్చే భక్తులు భయపడుతున్నారు. ట్రిపుల్ ఐటీతో పాటు గ్రామంలో విచ్చలవిడిగా వీధికుక్కలు సంచరిస్తున్నా యి. ఆలయ అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టాలి. – గోసుల రాజు, బాసర

తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలి

- గ్రామాల్లో అవగాహన కల్పించిన అధికారులు

భైంసారూరల్: వర్షాకాలంలో తాజా ఆహార పదార్థాలు తీసుకోవడంతోపాటు కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని డీఎల్‌పీఓ సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండలంలోని వానల్‌పాడ్‌లో పర్యటించారు. వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు, ఆరోగ్యకార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతర్గత రోడ్లు, మురుగుకాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ట్యాంకులు, చేతిపంపులు, బావుల్లో క్లోరినేషన్ చేపట్టి దోమల వృద్ధిని అరికట్టేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. అనంతరం పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఎంపీవో మోజంహుస్సేన్, కార్యదర్శి గాయత్రి తదితరులు ఉన్నారు.

డ్రై డేలో భాగంగా వైద్యాధికారి ప్రశాంత్ , వైద్యసిబ్బంది మండలంలోని గుండేగాం, సిద్దూర్, మిర్జాపూర్, లింగా, టాక్లి, కుంబి, మాటేగాం, పిప్రి, ఖత్‌గాం, మాంజ్రి గ్రామాల్లో పర్యటించారు. నిలవ్వనీటిని పారబోయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీటీచర్లు తదితరులు ఉన్నారు.

కుంటాల: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా కుంటాలలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యదర్శి రాజబాపు, అంగన్‌వాడీ టీచర్ రాణి, ఆశవర్కర్లు దేవకి, లక్ష్మి, విజయ, సిబ్బంది దిలీప్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని నూతన ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో మండల కేంద్రంలోని కాలనీల్లో పర్యటించారు. అనంతరం కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఎంపీవో అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


భైంసారూరల్: వానల్‌పాడ్‌లో డ్రమ్ములో నిల్వ నీటిని పారబోయిస్తున్న డీఎల్‌పీవో, సిబ్బంది

కుభీర్: డ్రైడే ఫ్రైడేలో భాగంగా మండల కేంద్రంలోని న్యూకాలనీలో ఎంపీడీవో మోహన్‌సింగ్ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఇళ్లలో నిలవ్వనీటిని పారబోయించారు. కార్యక్రమంలో ఈవో సాయినాథ్, అంగన్‌వాడీ టీచర్లు సత్యశీల, యశోద, ఏఎన్ఎం సరస్వతీ తదితరులు ఉన్నారు.

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి వీధులను పరిశీలించి.. సూచనలు చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి అశ్విత, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని, బూరుగుపల్లి(జి), రాంపూర్, బామ్ని(బి), చాక్‌పల్లి, నర్సాపూర్ (జి)గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. డ్రమ్ములు, కుండీలు, టైర్లు, కుండల్లో ఉన్న నిల్వ నీటిని పారబోయించారు. కార్యదర్శులు శైలజ, శివకుమార్, నవనీత్‌కుమార్, గంగాజల, నరేశ్‌కుమార్, వీనారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని నాలుగో వార్డు పరిధి శ్రీరాంనగర్‌లో వైద్య, మున్సిపల్ సిబ్బందితో కలిసి కౌన్సిలర్ నాయిని స్రవంతి పర్యటించారు. నిలవ్వనీటితో కలిగే వ్యాధులను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.


లక్ష్మణచాందలో సూచనలిస్తున్న ఎంపీడీవో రాధ


కుభీర్: న్యూకాలనీలో నీళ్లు పారబోస్తున్న సిబ్బంది


మామడ: దిమ్మదుర్తిలో ఎంపీడీవో, సిబ్బంది..

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

తానూరు: గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టిసారించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల వివరాలను తెలుసుకున్నారు. గంగాధర్ తదితరులు ఉన్నారు.

వీరసైనికుల త్యాగాలు మరువలేనివి

నిర్మల్‌ఖిల్లా: కార్గిల్ యుద్ధంలో పోరాడి వీర మరణం పొందిన సైనికుల త్యాగాలు మరువలేనివని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, లెఫ్టినెంట్ డాక్టర్ జె.భీమారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్మీ అధికారులు లాన్స్‌నాయక్ కుల్దీప్‌సింగ్, హవల్దార్ సోలంకి సంజయ్‌ను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ఈసందర్భంగా వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అంతకుముందు కార్గిల్ విజయ్‌దివస్ ర్యాలీ తీశారు. కార్యక్రమ సమన్వయకర్త టి.నర్సయ్య, అధ్యాపకులు పీజీరెడ్డి, రవికుమార్, శంకర్, రజిత, రమాకాంత్‌గౌడ్ సరితారాణి, నాగేశ్వర్, ఉమేశ్, అతీక్‌బేగం, పవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: దేశసేవకు యువత ముందుకు రావాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్ అన్నారు. కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శుక్రవారం నిర్మల్‌లో విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను సన్మానించారు. బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పాలాస భరత్, అసెంబ్లీ కన్వీనర్ కొండాజి శ్రావణ్, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ గిల్లీ, కోశాధికారి సోను నాయక్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల కార్తీక్ పాల్గొన్నారు.


నిర్మల్ కళాశాలలో సత్కరిస్తున్న అధ్యాపకులు

కుంటాల: కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో వీర మరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


భైంసాలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భైంసాటౌన్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి భూకిరణ్, రవి, కార్యదర్శి కార్తీక్ ఉన్నారు.

ముధోల్ : మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్‌దివస్ నిర్వహించారు. ప్రధానాచార్యులు సారథి రాజు వీరసైనికులకు నివాళులర్పించారు.

ఉద్యోగులకు సన్మానం

లోకేశ్వరం: అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే ఎక్కడైనా గుర్తింపు ఉంటుందని ఎంఈవో చంద్రకాంత్ అన్నారు. మండలంలోని బాగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసిన రాజారాం ఇటీవల బదిలీపై వెళ్లారు. శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎంకు సన్మానం ఏర్పాటు చేయగా ఎంఈవో హాజరై మాట్లాడారు. పీఆర్టీయూ బాధ్యులు రాజేందర్, శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, హెచ్‌ఎం మేఘన, గ్రామస్తులు లింగారెడ్డి, గంగాధర్, నర్సారెడ్డి ఉన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం బదిలీపై వెళ్లిన ఉద్యోగులను ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. బామ్ని(కే), గడ్‌చాంద, పిప్రి, కిష్టాపూర్, నగర్, వట్టోలి గ్రామ కార్యదర్శులతోపాటు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసిన పలువురిని సన్మానించారు. సూపరింటెండెంట్ వెంకట రమేశ్‌కుమార్, ఏపీవో జగన్నాథ్, టైపిస్టు రంజిత్, కార్యదర్శులు ఉన్నారు.

ఖానాపూర్: పెంబి నుంచి ఖానాపూర్‌కు బదిలీపై వచ్చిన ఎంపీవో రత్నాకర్‌రావును శుక్రవారం తన కార్యాలయంలో నాయకులు సన్మానించారు. గోపాల్‌రెడ్డి, ఎంఏ వకీల్, వెంకటరమణ, తదితరులు ఉన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఆర్ఐ రాజేశ్వర్‌ను నాయకులు రాకేశ్, రమేశ్, ఎర్రన్న శాలువాతో సన్మానించారు. బీర్నందిలో పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన దేవేందర్‌రెడ్డిని గ్రామస్తులు సుధాకర్, హరీశ్ సన్మానించారు.

ముధోల్ : తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను శుక్రవారం తన కార్యాలయంలో బీజేపీ నాయకులు సన్మానించారు. ధర్మపురి సుదర్శన్, దశరథ్, తాటివార్ రమేశ్, భూమేష్, సతీశ్‌రెడ్డి, సాయినాథ్, గంగాప్రసాద్ ఉన్నారు.

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం వీడీసీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు శిరిష, శ్రీదేవి, వెంకటనారాయణ ను శుక్రవారం పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అనంతరం బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు రాజేశ్వర్, రాజ్‌కుమార్‌ను సన్మానించారు. ఇలసరం లింగన్న, సుంకరి రాజేశ్వర్, బండి లింగన్న, గంగన్న, రాము పాల్గొన్నారు.

ముధోల్ : మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఇటీవల ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన లక్ష్మారెడ్డి, సాహెబ్‌రావును శుక్రవారం సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాంచారు.

తిర్పెల్లి పాఠశాల పరిశీలించిన ఎంఈవో


గది పరిశీలిస్తున్న ఎంఈవో మధుసూదన్

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఇన్‌చార్జి ఎంఈవో మధుసూదన్ పరిశీలించారు. గురువారం వర్షానికి పాఠశాల భవనంలో ఉన్న రెండు గదులు ఉరువడంతో విద్యార్థులను వరండాలో కూర్చొబెట్టారు. మరో గదిలోని పైకప్పు పెచ్చులు ఊడి కింద పడ్డాయి. విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎంఈవో శుక్రవారం పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. వెంటనే భవనంపై పేరుకుపోయిన చెత్త, గడ్డిని తొలగింపజేశారు. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయురాలు నవ్య ఉన్నారు.

మరిన్ని బ్యాంకు రుణాలు అందిస్తాం


మాట్లాడుతున్న మేనేజర్ రాంగోపాల్

లోకేశ్వరం: స్వయం సహాయక సంఘం సభ్యులు, రైతులకు మరిన్ని రుణాలు అందిస్తామని నిర్మల్ లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గడ్‌చాంద గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు బ్యాంకు ఆధ్వర్యంలో నగదు లావాదేవీలపై కళాజాత ప్రదర్శించారు. మేనేజర్ బీమా పథకాలు, విశ్వకర్మ యోజన గురించి వివరించారు. కార్యక్రమంలో సీఎఫ్ఐ కౌన్సిల్ రాపతి వినయ్, మల్లేశ్ పాల్గొన్నారు.

'బాసర ఆలయ అభివృద్ధిపై నిర్లక్ష్యం'


నాయకులతో మాట్లాడుతున్న రావుల రాంనాథ్

బాసర: రాష్ట్ర ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం మండలాధ్యక్షుడు కిశోర్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించగా రాంనాథ్ హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించగా కేవలం రూ.8 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇతర మతస్తులను ఆరుగురిని ఆలయంలో ఉద్యోగులుగా నియమించారని.. వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. పార్టీని బలోపేతం చేసి స్థానికసంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకుముందు ఆలయంలో పూజలు చేశారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్, మాజీ ఎంపీపీ సాయిబాబా, గణేశ్, ప్రతాప్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ధైర్యంగా ముందుకెళ్తేనే అభివృద్ధి


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ మౌనిక

కుంటాల:మహిళలు ధైర్యం ముందుకెళ్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కోఆర్డినేటర్ మౌనిక, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు శైలజ పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల ఆదర్శ పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిజజీవితంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు– పరిష్కారంపై అవగాహన కల్పించారు. మహిళా సాధికారత, లింగ వివక్ష, బాల్య వివాహాలు, బేటీబచావో–బేటీ పడావో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలు విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయురాలు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

పెంబి: మండల ఎంపీవోగా అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీవోగా పని చేసిన రత్నాకర్‌రావు బదిలీపై ఖానాపూర్ వెళ్లారు. దస్తురాబాద్ మండలం నుంచి అనిల్‌కుమార్ బదిలీపై పెంబి వచ్చారు. అనంతరం వారిద్దరిని కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో రమాకాంత్, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, నాయకులు ఉన్నారు.

దస్తురాబాద్: మండల నూతన ఎంపీవోగా శుక్రవారం రమేశ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీవోగా పనిచేసిన అనిల్ బదిలీపై పెంబి మండలానికి వెళ్లగా.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో పని చేసిన రమేశ్‌రెడ్డి బదిలీపై మండలానికి వచ్చారు.

కుభీర్ ఎంపీడీవోగా మోహన్‌సింగ్

కుభీర్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా(ఎంపీడీవో)గా మోహన్‌సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీరు తానూరు నుంచి బదిలీపై వచ్చారు. అనంతరం కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీవోను సన్మానించారు. ఈయన గతంలో మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు.

ఖానాపూర్ వైద్యుడిగా వేణుగోపాలకృష్ణ

ఖానాపూర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఎంవోగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ వేణుగోపాలకృష్ణ శుక్రవారం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. ఈయన గతంలోనూ ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


భైంసాలో మొక్క నాటుతున్న సీఐ రాజారెడ్డి

భైంసాటౌన్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని పట్టణ సీఐ డి.రాజారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుభద్రవాటిక శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వనమహోత్సవం నిర్వహించగా సీఐ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చందూలాల్, పాఠశాల కమిటీ అధ్యక్షులు రమేశ్ మాశెట్టివార్, ప్రబంధకారిణి సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'వన మహోత్సవంపై నిర్లక్ష్యం వద్దు'

తానూరు: వన మహోత్సవంపై నిర్లక్ష్యం వద్దని పీపీడీ ఓస ప్రసాద్ సూచించారు. మండలంలోని బోరిగాంలో వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించారు. నర్సరీ, పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఈజీఎస్ ఏపీఓ గంగాధర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: ఖాళీ ప్రదేశాలు, ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఏపీఓ శివలింగం అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఖత్‌గాం గ్రామంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ రాజు, ఈజీఎస్ సిబ్బంది శ్రీధర్, శేఖర్, కార్యదర్శి శివనంద్, అంగన్‌వాడీ టీచర్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో శుక్రవారం కార్గిల్ అమరవీరుల జ్ఞాపకార్థం మా అమ్మ–నాన్న ఫౌండేషన్ చైర్మన్ మాదరి ఆంజనేయులు మొక్కలు నాటారు. బాతూరి నరేశ్, దిలీప్ ఉన్నారు.

డీజీపీని కలిసిన రాంకిషన్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీజీపీ జితేందర్‌ను శుక్రవారం హైదరాబాదులోని తన కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్ రెడ్డి, లోలం శ్యాంసుందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.